క్లుప్తంగా

గాజులు, క్షీర నివేదన పూజలు



రామాలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

బలిజిపేట: ధనుర్మాస పూజల్లో భాగంగా వెంగాపురం రామాలయంలో గురువారం స్వామివారికి క్షీరం నివేదన చేసి, గోదాదేవికి గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు గోపాలకృష్ణ, ఫణికుమార్ శర్మ, సూర్యనారాయణల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలను నిర్వహిస్తున్నారు. ధనుర్మాసంలోని విశేష రోజుల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. 18వ పాశురాన్ని చదివి గాజులు, క్షీరం నివేదన చేసి తిరుప్పావై ప్రకారం దేవిని ఆరాధించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలతో పూజలు జరిపించారు. 108కలవ పూలతో స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు పవర్ కట్

సాలూరు: సాలూరు సబ్‌స్టేషన్ పరిధిలో మండలంలోని బాగువలస ఫీడర్‌లో విద్యుత్‌మెయింటనెన్స్ పనుల్లో భాగంగా చెట్టు కొమ్మలు తొలగించే నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు గోపాలరావు నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.బాగువలస ఫీడర్ పరిధిలో గల చంద్రంపేట, పెదబోరబంద, బాగువలస ,తాడిలోవ, పెదపధం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి



పుష్పాలంకరణలో దర్శన మిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీనృసింహ స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో స్వామివారిపై ఉన్న నమ్మకంతో ఆలయానికి వచ్చిన భక్తులు ముడుపుల పూజలు నిర్వహించారు. అలాగే ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే కోరికలు తీరుతాయన్న విశ్వాసంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని పూజా సామగ్రితో దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు, అర్చకులు పూజలు చేయించారు. దూర ప్రాంతాల నుంచి ఉపవాసాలతో వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎనీమియా నివారణకు ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డాక్టర్ పి.పావని

సీతానగరం: మండలంలోని మహిళల్లో హిమోగ్లోబిన్ (ఎనీమియా) లోపాన్ని నివారించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పి.పావని అన్నారు. ఈ మేరకు పీహెచ్‌సీలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీహెచ్‌సీకి వివిధ రకాల అనారోగ్యపరమైన కారణాలతో వచ్చిన వారికి ముందుగా హెచ్‌బీ పరీక్ష నిర్వహించనున్నామని, తదుపరి అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకుని వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఎనీమియాతో ఎక్కువమంది మహిళలు ఉన్నారని అందుకు అవసరమైన వైద్యసేవలు అందించనున్నామని తెలిపారు. ఇప్పటికే పీహెచ్‌సీలో సిబ్బంది సహకారంతో ఎనీమియా నివారణ చర్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు.

క్యూఆర్ కోడ్‌తో బిల్లు చెల్లింపు సులభం

- లైన్‌లో నిల్చోవాల్సిన అవసరం లేకుండా..
- వెంటనే చెల్లింపులు పూర్తి

బలిజిపేట: విద్యుత్ వినియోగదారులకు బిల్లుల చెల్లింపులు మరింత సులభతరమయ్యాయి. గతంలో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఒకరోజు కేటాయించి క్యూలో నిల్చుని చెల్లించాల్సి వచ్చేది. ఆ తరువాత పేటీఎం, జీపే ద్వారా చెల్లింపులు జరిపేవారు. ఇప్పుడు లేటెస్ట్‌గా క్యూఆర్ కోడ్‌ను బిల్లుపైనే ఏర్పాటుచేయడంతో వినియోగదారులు వెంటనే బిల్లును దాని ద్వారా చెల్లింపుచేసేందుకు సులభతరమవుతోంది. ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. మీటర్ రీడింగ్ తీసి బిల్లు ఇచ్చేటప్పుడు దాని దిగువన క్యూఆర్ కోడ్ వస్తుంది. దాన్ని స్కాన్ చేసి వినియోగదారుడు వెంటనే వారివారి యూపీఐ యాప్‌లైన్ ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా బిల్లులను సులువుగా చెల్లించేందుకు అవకాశం కల్పించారు. గతంలో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా బిల్లులు చెల్లించేవారు. కొన్ని సాంకేతిక కారణాలతో యాప్‌ల నుంచి ఏపీఎస్పీడీసీఎల్‌ను తొలగించారు. దానికి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అది ఇబ్బందికరంగా ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతో క్యూర్ కోడ్‌ను అమలులోకి తెచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎస్‌పీడీసీఎల్‌లో ఈవిధానాన్ని తొలిసారి తీసుకువచ్చారు.

కొన్ని నెలలుగా ఆగిన యూపీఐ సేవలు

గత ఏడాది జూన్ వరకు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న ఫోన్ పే, గూగుల్ పే, ఏటీఎం, అమెజాన్ వంటి తదితర మార్గాలతో విద్యుత్ బిల్లుల చెల్లింపులకు అవకాశాలుండేవి. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో విద్యుత్ సంస్థలు ఆ సేవలు నిలిపివేశాయి.



క్యూఆర్ కోడ్‌తో ఉన్న విద్యుత్ బిలు

జాప్యం, చార్జీల కారణాలతో..

యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉండే సంస్థలకు వినియోగదారులు చెల్లించే నగదు వెళ్లేది. అక్కడి నుంచి ఏపీఎస్పీడీసీఎల్ ఖాతాలకు రీ-డైరెక్ట్ చేసేవారు. అయితే ఈ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సకాలంలో బిల్లులు జమ కాకపోవడంతో తేడాలొచ్చేవి. అంతేకాకుండా యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లకు ఏపీఎస్పీడీసీఎల్ వల్ల ఎక్కువ ఆదాయం కూడా ఉండేది. యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ ద్వారా బిల్లు చెల్లిస్తే ఒక కనెక్షన్‌కు రూ.2.50పై కమీషన్ ప్రొవైడర్లకు దక్కేది. మిగిలిన మొత్తం ఏపీఎస్పీడీసీఎల్ సంస్థకు అందేది. దీనిలో జాప్యం కారణంగా ఆర్బీఐ అభ్యంతరం వ్యక్తం చేయడంతో యూపీఐ ప్రొవైడర్ల ద్వారా బిల్లులు చెల్లించే పద్ధతిని రద్దుచేశారు.

మండలంలో విద్యుత్ సర్వీసులు 20,793

క్యూఆర్ కోడ్ ఉన్న సర్వీసులు 16,700. కేటగిరీ 1, 2లకు మాత్రమే ఈకోడ్‌ద్వారా బిల్లులు చెల్లింపులు జరుగుతాయి. కేటగిరీ 3, వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించిన మాన్యువల్‌గా బిల్లులు తీయడంతో వారు కోడ్‌ద్వారా చెల్లించేందుకు అవకాశాలు లేవు.

సులువుగా చెల్లింపులు

క్యూఆర్ కోడ్ అమలు వల్ల బిల్లుల చెల్లింపులు సులువుగా జరుగుతున్నాయి. వినియోగదారులకు కచ్చితంగా బిల్లు చెల్లింపు జరుగుతుంది. వినియోగదారులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు.

సింహాచలం, ఏఈ, విద్యుత్‌శాఖ, బలిజిపేట



విద్యుత్ సబ్‌స్టేషన్

చర్చి ప్రారంభోత్సవానికి రాజన్నదొరకు ఆహ్వానం



చర్చి ప్రారంభోత్సవానికి రాజన్నదొరకు ఆహ్వానం పలుకుతున్న పాస్టర్ ఫాదర్‌జోసఫ్‌బందనాథం, రిటైర్డ్ ఎక్సైజ్‌సీఐ దాసు తదితరులు

సాలూరు: మండలంలోని తీనుసామంతవలసలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవానికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు చర్చి ఫాదర్‌జోసెఫ్‌బందనాథం ఆహ్వానం పలికారు. ఈ మేరకు గురువారం రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. వచ్చే నెల 20న తీనుసామంతవలసలో చర్చి ప్రారంభోత్సవానికి విశాఖపట్నం నుంచి పాలనాధికారి జైరావు గారు రానున్నట్లు వివరించారు. కావున ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని రాజన్నదొరను కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ దాసు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణకు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్సై ఎల్.శ్రీనివాసరావు

సీతానగరం: ఆన్‌లైన్, మొబైల్ ఫోన్‌ల ద్వారా జరుగుతున్న సైబర్‌నేరాల నివారణకు, మాదకద్రవ్యాల స్వీకరించడం వల్ల కలిగే ఆరోగ్యపరమైన సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై ఎల్.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని రాష్ట్ర రహదారిపై చినభోగిలి-సీతానగరం గ్రామాల మధ్య బ్రిడ్జి సమీపంలో వాహనాల చోదకులతో శుక్రవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సై ఎం.రాజేష్ పర్యవేక్షణలో గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అభంశుభం తెలియని ప్రజలు మాదక ద్రవ్యాలు తీసుకున్నందున ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడుతున్నారని తెలియజేశారు. అలాగే వాహనచోదకులు హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్నవారు ప్రమాదాల్లో తలకుబలమైన గాయాల పాలై ప్రాణాపాయంలోకి వెళ్తున్నారన్నారు. హెల్మెట్ ఉంటే అంతప్రమాదానికి గురి కారన్నారు. ద్విచక్రవాహనాలతో ప్రయాణం చేస్తున్న వారంతా విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా హెచ్‌సీ ఎం.సుజాత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సదస్సు జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సాలూరు: పట్టణంలో శనివారం లారీ ఓనర్స్ ఆఫీసులో తలపెట్టిన మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌వైనాయుడు, శ్రీనివాసరావు, రాంబాబు, రామారావు, బలరాం, శంకర్రావులు కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలో లారీ ఓనర్స్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మోటార్ రంగంలో ఉన్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సుకు ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకుడు లక్ష్మయ్య పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సులో మోటార్ కార్మికులు, యజమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు

- మాజీ డిప్యూటీ సీఎం పీడికరాజన్నదొర



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఓం శాంతి సభ్యులు

సాలూరు: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎంతో అభిమానంతో తనవద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రముఖులు తదితరులందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలని మాజీ డిప్యూటీ సీఎం సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని రాజన్నదొర స్వగృహానికి వచ్చి పలువురు ప్రజలు, ప్రముఖులు తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో కూడా రాని విధంగా అనూహ్యంగా వేలాది సంఖ్యలో జనసందోహం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బారులు తీరి తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీపై, తమ కుటుంబంపై ఇంత అభిమానం చూపిస్తున్న ప్రజలందరికీ పేరుపేరున పార్టీ తరఫున, తన కుటుంబం తరఫున నమస్కారాలు తెలియజేస్తున్నానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ:

మక్కువ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటభైరిపురం, మక్కువ, శంబర, దుగ్గేరు 11కేవీ ఫీడర్లకు సంబంధించిన గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జోగినాయుడు గురువారం తెలిపారు. మక్కువ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. త్రీఫేస్ సప్లైలో ఉదయం 4 గంటల నుంచి 8గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. సరఫరాలో అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధిలో మేనేజ్‌మెంట్ కమిటీలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎఈఓ-2 శ్రీనివాసరావు

బలిజిపేట: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలే కీలకమని ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు వెలుగు కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన ఫలితాలు, మౌలికవసతి, సౌకర్యాలు తదితర అంశాలపై సమాజ భాగస్వామ్యం ఉంటేనే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. వాటికి ఎస్ఎంసీ సభ్యులు సహకరించాలని కోరారు. శిక్షణ పొందిన డీఆర్పీలు సభ్యులకు శిక్షణలో ఉండే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



సీతానగరం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులను ఓట్లు వేయాలని అర్థిస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె. విజయగౌరి

సీతానగరం: మార్చి నెలలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న కోరెడ్ల విజయ గౌరి మంగళవారం మండలంలో యూటీఎఫ్ యూనియన్ ఉపాధ్యాయులతో సుడిగాలి పర్యటన చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయ గౌరికి మద్దతుగా యుటీఎఫ్ యూనియన్ మండల, జిల్లా నాయకులు ఆర్. వెంకంపేట, సీతానగరం, బూర్జ, నిడగల్లు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఎన్నికలను పురస్కరించుకుని ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలోఉంటూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో రాజీలేని పోరాటం చేశానన్నారు. విద్యారంగ సమస్యల పట్ల పూర్తి అవగాహన తనకు ఉందని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో గొంతు వినిపించే అవకాశం ఓటర్లు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై నిబద్ధతతో నిస్వార్థ పోరాటం చేస్తున్న పీడీఎఫ్‌కు అవకాశం ఇవ్వాలని, ఉత్తరాంధ్ర నుంచి మండలిలో మొదటి మహిళా ప్రాతినిధ్యాన్ని బలపరచాలని కోరారు. పర్యటనలో యూటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బూరాడ ఆదినారాయణ, ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన ముమ్మరం చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి తిరుపతయ్య

మక్కువ: రక్తహీనత నివారణపై అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేయాలని మండల ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ ఎ.డి తిరుపతయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోషకాహారం సమృద్ధిగా తీసుకుంటే రక్తహీనత నివారణ సాధ్యమవుతుం దన్నారు. రక్తహీనత నివారణపై ప్రజలకు వివరించేలా కమిటీలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, ఈవోపీఆర్డీ పి.దేవకుమార్, మక్కువ, శంబర పీహెచ్‌సీల వైద్యాధికారులు నిఖిల, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పింఛన్ దారులు లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్న ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ ఆరిక మన్మథరావు

పార్వతీపురంటౌన్: పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ ఆరిక మన్మథరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన రైతు బజార్ వద్ద గల రాష్ట్ర ప్రభుత్వ పింఛను దారుల భవనంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం సబ్‌ట్రెజరీ పరిధిలో ఉన్న పింఛన్ దారులు ఫిబ్రవరి 28వ తేదీవరకు లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉన్నందన్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 28వ తేదీ వరకు కార్యాలయం పనిదినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు నిర్వహిస్తామన్నారు. పింఛను దారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మంచం పట్టి లేవలేని పింఛను దారుల వివరాలు ఆఫీసులో తెలియజేసినట్లయితే వారి ఇంటి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంచిపల్లి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 70లో సమూలంగా మార్పులు చేయాలి

- టి.జోగారావు, సీనియర్ న్యాయవాది, అడ్వైజర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అడ్వైజర్ టి.జోగారావు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగ వ్యతిరేకపరమైన జీఓ నంబర్ 70లో సమూలంగా మార్పులు చేయాలని సీనియర్ న్యాయవాది, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అడ్వైజర్ టి.జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు పకడ్బందీగా అమలు చేసేందుకే రాజ్యాంగంలో అనేక చట్టాలు రూపాంతరం చెందాయని, వాటిని కొంత మంది స్వార్థ ప్రయోజనం కోసం కోట్లాదిమంది కార్మికుల హక్కులు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని, ఇది చట్ట విరుద్ధమైన చర్య అన్నారు. విధానపరమైన లోపాలను కప్పిపుచ్చేందుకు దిగువనున్న కార్మికులపై జులుం ప్రదర్శించడం సరైనది కాదని, ఆర్టీసీ వర్కర్లు చేసే చిన్నచిన్న తప్పులకు సస్పెన్షన్లు, ట్రాన్స్‌ఫర్‌లు చేయడం సరైనది కాదని, ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ఉద్యోగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు

అనంతరం ఎస్‌డబ్ల్యూఎఫ్ విజయనగరం జోనల్ అధ్యక్షుడు వి.రాములు మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల పరిష్కారం చేసే భవిష్యత్ పోరాటాలకు పూర్తి మద్దతు ఉంటుందని, అలాగే యజమాని చేతుల్లో కార్మికులు కీలు బొమ్మలు కారని, ఎదిరించే శక్తి ఉమ్మడిగా మనందరిలో కలిగి ఉండాలన్నారు. 1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని, ఎంవీఏ సెక్షన్ 124 ప్రకారం టికెట్ తీసుకోవాల్సిన బాధ్యత ప్రయాణికులపై ఉండాలని, టికెట్ లేని ప్రయాణానికి రూ. 500 జరిమానా విధించాలని, బస్సుల్లో స్లోగన్స్ రాయించాలని, చట్ట వ్యతిరేకపరమైన జీఓ 70లో సమూలంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పార్వతీపురం డిపో అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్.సింహాచలం, ఐక్య సంఘాల నాయకుడు పి.సంగం, ఏఐఎస్ఎఫ్ నాయకుడు బి.రవికుమార్, ఎఐవైఎఫ్ నాయకుడు బీటీ నాయుడు, డిపో ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు. డిపో ఉపాధ్యక్షులు ఎస్.అప్పలరాజు వందన సమర్పణతో సమావేశం ముగించారు.

ఆశలు, సీహెచ్‌డబ్ల్యూఓలు దిక్సూచీలు



కుంతాం గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

పాచిపెంట: మారుమూల గిరిజన గ్రామాలకు ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూఓలు దిక్సూచీలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు పాచిపెంటమండలంలోని పాచిపెంట పీహెచ్‌సీ పరిధిలో కుంతాం గిరిజన గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో గత వారంలో మలేరియా జ్వరానికి గురైన అమూల్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న వైద్యారోగ్యశాఖ సర్వేలపై ఆరా తీశారు. ఎవరు అనారోగ్యానికి గురైనా వెంటనే గుర్తించి చికిత్స అందించాలని డాక్టర్ వెంకటరమణను ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.